# జారిన కాలు



ఏదైనా ప్రారంభం కావాలంటే వాతావరణం అనుకూలంగా వుండద్దూ! మధ్యాహ్నం రెండుగంటలవేళ ముహూర్తము టపీమని కుదిరింది. కుర్రాళ్లు కాలేజీకి వెడుతున్నారు. వాళ్లను చూసి యశోద తనూ బయటికి అడుగు వేసింది. బయటకు పాదం పడీపడ్డంలో ఆమెకు రాధ ఎదురైంది. చంకలో పిల్లాడు యశోదకేసి కొత్తగా చూశాడు.

రాధని అప్పట్లో చూడగలుగుతానని యశోద అనుకో లేదు. అందుచేతనే ఆమె చటుక్కున ఆగిపోయింది. కాని లోపట ఏంవుందో నోటంట మాట మాత్రం రాలేదు.

'ఏమే యశోదా, ఎక్కడికే!' అన్నది రాధ.

'కాలేజీకి' అన్నది యశోద.

'తొందరా!' అన్నది రాధ.

'టైము అయిపోయింది. సాయంత్రం వరకూ ఉంటావు కదూ' అన్నది యశోద.

'వుంటాను. సాయంత్రం త్వరగా వచ్చేయి' అన్నది రాధ.

అల్లాగే అంటూ యశోద చరచరా వీధిలోకి అడుగు వేసింది. అడుగులో అడుగు పడుతోందన్నమాటే గాని యశోదకు ఎందుచేతనో అది యిదివరకటి దానిలా లేదు. నిముషంలో ఎంతో బరువుగా మారిపోయింది.

ఇది యశోద గుర్తించక పోలేదు. తనలో కలిగిన ఆ కలవరపాటుకి కారణం ఏమిటా అని ఆలోచించింది. దూరంగా జరిగిపోయిన రాధే కారణమేమో అనుకుంటూ కాలేజీ సందులోకి మళ్ళింది

అక్కణ్ణించే కుర్రాళ్ళ అలికిడి ప్రారంభం అవుతుంది. రోజూ పడేమాదిరిగానే ఆమె వెనక్కాలే కాలంలోని పడుచు కుర్రాళ్ళు పడ్డారు. వాళ్ళని గురించి యశోదకు చాలా తెలుసు. వాళ్ల మాటలుగాని, చేష్టలుగాని ఎప్పుడూ, సర్వకాల సర్వావస్థలయందూ ఒకేమాదిరిగా వుంటాయి. ఒకసారి నవ్వు వస్తుంటే, నా ప్రేమని వ్యక్తం చేసుకుంటా నంటూ డొక మొనగాడు. మా గది

చింతా శ్రీరామచంద్రమూర్తి

కాళీగానే వుంది, ఏమి కారునో అని వంకపెట్టి మా గదికి రావచ్చు, అంటాడొక యంబ్రహ్మ. ఇల్లాంటి కుర్రాళ్ళని వదిలి తన అందాన్ని చూసి తన వెంట పడమంటాడు, ఒక బ్రహ్మచారి మాష్టరు త్యాప్త్రిం. ఇల్లా అడిగేవాళ్ళలో అనేక కులాలుంటాయి. వాళ్ళంతా నానా గోత్రీభ్యః గాళ్ళు. యౌవనం కలిగించే నిషాలో తాత్కాలిక ఉపశమనం వాంఛించే కామ పీడితులేగాని నువ్వూ, నేనూ కలిసి వివాహం చేసుకుని చల్ మోహానరంగా పాట పాడుకుందామని ఒక్కడూ అనడు.

అందుకనే యశోదకు వాళ్ళంటే కోపం. కోపమయినా వాళ్ళనే భరించుకొస్తోంది. దానికి కారణం లేకపోలేదు. ఈ జన ప్రవాహంలో ఎక్కడో మానవత్వం వికసించి, సంస్కారం కలిగిన యువకుడొకడైనా ఉండకపోతాడా అని ఆమె విశ్వాసం. ఆమె విశ్వాసం పట్టుకే గాని అల్లాముందుకు రాగలిగినవాడొక్కడూ నేటివరకూ యశోదకు కనిపించలేదు.

తన మనస్సులో వున్న కలవరపాటునీ, తన భవిష్యత్తునీ స్మరించుకుంటూ యశోద మర్రిచెట్టు దగ్గరకు చేరుకుంది. కాలేజీ మొగలో వున్న ఆ మర్రిచెట్టుకొక ప్రత్యేక చరిత్ర వుంది. అక్కడికి వచ్చేటప్పటికి ప్రపంచం పెద్దది అవుతుంది. ప్రజలు ఎక్కువమందుంటారు. రహస్యాలు అక్కడ దాగవు. అందుచేత కుర్రాళ్లు ఒక వైపూ, ఆడపిల్లలు మరొక వైపూ విడిపోవడం అనాదిగా వస్తూన్న ఆచారం. అల్లా విడిపోయిన ప్రేయసీ ప్రియుల్లో అనేకుల కథలు యశోదకు తెలుసు. ఆమెకూడా విడిపోతూందన్న మాటే గాని, ఆమెకు యిప్పటివరకూ ప్రియుడొక్కడూ కుదరలేదు.

మూడవ గంట కొట్టారు. అందరూ తలొక గదిలోకి దూరుతున్నారు. ఇంగ్లీషు మాస్టరు వెనకాలే యశోదకూడా క్లాసులోకి దూరింది. మాస్టరు పాఠం మొదలెట్టాడు. కాని ఆమె దృష్టి పాఠంమీద నిలవలేదు. కష్టంమీద మనస్సును కట్టెయ్యడానికి ప్రయత్నం చేసింది. కాని అది ఆగలేదు. వడివడిగా రాధమీదకు దూసుకుపోయింది. అంతలోనే ఆమెమీద ప్రేమా, ద్వేషమూ, అసూయా, ఒకటేమిటి అన్నీ కలిగాయి. అంతలోనే అన్నీ మాయమయ్యాయి. ఈ విధంగా కిందా మీదా పడుతూ ఆమె మనస్సు అయిదు సంవత్సరాల వెనక్కు ఒక్క గెంతువేసింది.

అసలు కథ ఏమిటంటే, అయిదు సంవత్సరాల క్రితం...చాలదు, అయిదు సంవత్సరాల కాలం చాలదు-యశోద కాలగమనంలో దొర్లుకుంటూ యిప్పటి యీ స్థితిలోకి పరివర్తన ఎల్లా పొందిందీ అన్న విషయం తెలుసుకుందికి మనం పది సంవత్సరాలు వెనక్కు పోవాలి.

అయితే ఒక్క యథార్థం వుంది. ఇల్లాంటి యశోదల్ని కథకులు కథలకోసం సృష్టిస్తారనుకోవడం పొరపాటు. లోకంలో కావలసినంత మంది మనుష్యులున్నారు. కళ్ళుంటే ప్రతి ఒక్కడూ చూసుకోవచ్చు. కాగా యశోదని మేం ఎరుగుదుం గనక యిక్కడ విపులీకరించవలసిన అవసరం కనపడింది.

యశోద చురుకైందికాదంటే అబద్ధమే అవుతుంది. నల్ల త్రాచులాంటి పొడుగైన జడా, విశాలమైన కళ్ళల్లో ప్రపంచాన్ని విమర్శించే భావనాశక్తీ, ఎర్రటి పెదిమల మధ్యని మల్లె మొగ్గల్లాంటి పలువరుసా - ఎంతో చక్కగా వుంటుంది యశోద. ఎక్కువ పొడుగూ కాకుండా అంత పొట్టి కాకుండా అందమైన ఆకారం ఆమెది.

అయితే యీ యశోదే, పదేళ్ళక్రితం యింత అందమైందికాదు. ఇంత తెలివైందీకాదు. ఆ సమయంలోనే యశోదకు పెళ్లికానిచ్చారు. పెళ్ళయిన నెలరోజులకి యశోద జాతక చక్రం విమర్శించవలసిన అవసరం పట్టింది. జ్యోతిష్కులూ, బంధువులూ, ఆమెని ఎరుగున్న ప్రతివాళ్లూ, యశోద మహాపాపం చేసుకున్నట్టు ప్రచారించారు. కర్మ ఎక్కడంటే ఆ పాపమైనా యశోద కిందటి జన్మంలో చేసుకుంది. కిందటి జన్మలో చేసుకున్న పాపానికి భగవంతుడు యీ జన్మలో శిక్ష విధించాడు. తత్ఫలితంగా యశోద మొగుడు తన చిన్న చేతుల్తో యశోద గొంతుక కోశాడు. అయితే కొంతమంది తార్కికులు దేవుడిమీద ధ్వజమెత్తక పోలేదు. నా దగ్గర పాపాత్ముల జాబితా లెక్కువైపోయి, జన్మాంతరంలోకి వాయిదా వేశానన్నాడు దేముడు.

అపోహల మాటకేంకాని, యిల్లాంటి వితంతువుల్ని వివాహం చేసుకోవద్దని భగవంతుడు ఎవరికీ ఎప్పుడూ చెప్పలేదు. ఈమాట మాత్రం నిర్వివాదాంశం.

అయితే, ఆవిధంగా చచ్చిపోయిన మొగుణ్ణి గురించి యశోదకు కొన్ని చిన్న జ్ఞాపకాలున్నాయి. తాళి కట్టించుకునేటప్పుడు ఆమె ఎంతో సంతోషపడ్డది. తలంబ్రాలు తానే గబగబా పోసింది. బంతులాడినప్పుడు తనే వాడి కళ్ళల్లోకి కొట్టింది. ఏం చేస్తే యేం వాడు బతికి బట్ట కట్టలేదు. ఇంతకు మించి ఆ చిన్నతనంలో పెళ్లికి జరిగిన విషయాలు ఆమెకు ఏవీ జ్ఞాపకం లేవు. దీనికి కారణం ఆమె పన్నెండు సంవత్సరాల భర్తా ధ్యానం మని ఎగిరి పోవడమే అనడంలో పొరపాటు ఏమీ లేదు.

కాగా, ఆ జ్ఞాపకాలతో బాధపడవలసిన అవసరం అంతకు ముందుతరం వాళ్ళకిగాని ఆమెకు లేదు. వాళ్ళయితే తలవెంట్రుకలు తీసెయ్యాలి. రవికలు సైతం తొడుక్కోడం విరమించాలి. తెల్ల పంచె కట్టుకుని వంటింట్లో రొట్టె ముక్క కాల్చుకోవాలి. ఉప్పు పిండి చేసుకోవాలి. వాళ్ళకి మరో పెళ్ళిమీద ఆశ లుండకూడదు. చచ్చిపోయిన పెనిమిటిగారు ఆ చిన్నతనంలో చేసిన ముచ్చట్లే కలకాలమూ చెప్పుకోవాలి.

కాని సంస్కర్తలు పుట్టి తెలుగు దేశాన్ని కొంతవరకూ కడిగి శుభ్రపరచిన కారణంచేత, యిల్లాంటి యశోదలు చాలామంది సుఖిస్తున్నారు. చెప్పేదేమిటంటే యశోద తండ్రి కళ్లు తెరిచాడు. వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు ఆయన వినిపించుకున్నాడు. చదువు చెప్పించినట్టయితే, యశోదలాంటి ఆడపడుచులు ఒంట్లు పట్టవలసిన అవసరం లేదనీ, తగినంత సంస్కారమూ, విజ్ఞానమూ కలిగి వాళ్ళకి వాళ్ళే భవిష్యత్తును నిర్ణయించుకుంటారనీ ఆయన నమ్మాడు. నమ్మక చేతనే బడిలో వేశాడు. వెయ్యటం తడవుగా యశోద హైక్లాసులికి రప్పుని వెళ్లింది. ఆమెకు ప్రతి ఏటా పరీక్షల్లో జయమే చేకూరింది.

ఆ చిన్నతనంలో యశోదకు తాను చేస్తూన్న పని ఏదో గొప్పదని ఏమీ తెలీదు. కాని వయస్సువచ్చి మీదపడేకొద్దీ, తను సంస్కారం వైపు నడుస్తున్నా ననుకొన్నది. తన తలి తండ్రులు తనకి తిరిగి వివాహంచేసే అభిప్రాయంలో విద్యాబుద్ధులు చెప్పిస్తున్నట్టు గ్రహించుకుంది ఆమె అంతరాత్మ సంఘంలో వస్తూన్న నూతన చైతన్యాన్ని గ్రహించి, నెమలిలా పురి విప్పుకుంది. ముందు రాబోయే ఏదో విముషం కోసం ఆమె ఎదురు చూస్తూనేవుంది. నిజంగా తనిలాంటిదాన్ని పెళ్ళి చేసుకుందికి ఎవరైనా ముందుకు అడుగువేస్తారా అని అనుకున్న ఘడియలుకూడా యశోద జీవితంలో లేకపోలేదు.

ఇలా అనుకునే రోజున ఆమె హైస్కూల్లో వుంది. ఆ రోజున ఆమె తెల్లటి జరీ అంచు చీర కట్టుకున్నది. నల్లటి జుట్టులో ఎర్రని మందారం వున్నది. కాని ఒక్క బొట్టుమాత్రం మొఖాన వెలితిగా వున్నది.

ఆ కాలంలో హైస్కూళ్లు యిప్పటిలా లేవు. ఆడపిల్లలూ మగపిల్లలూ కలిసిమెలిసి తిరగడం మహాపరాధం కాని రావాలనుకుంటూన్న విప్లవం చప్పున వచ్చింది. దొంగ పోటుగా రాలేదు. అందరికీ కనపడేలాగే వచ్చింది. అది వచ్చే టైముకి నిద్రపోయినవాళ్లు నిద్రపోతుంటే మేలుకున్న వాళ్ళు దానికేసి చూశారు. అందులో కలిసిపోగలిగిన వాళ్ళు కలిసిపోయారు. అలా విప్లవంలో కలిసి ప్రవహించిన వాళ్ళల్లో యశోద క్లాసే చదువుతున్న రామకృష్ణ అనే అబ్బాయి ఒకడున్నాడు.

జరీఅంచు చీరకట్టుకుని, మేడమెట్లు ఎక్కుతున్న యీ అందమైన బొట్టులేని ఆడపిల్ల ఎవరా అని రామకృష్ణ అనుకున్నాడు. వాడిలో మొట్టమొదటినించీ యీ వెతకడమన్నది వుంది. వాడు యశోదని గురించి దీర్ఘంగా ఆలోచించాడు. ఇల్లాంటి పిల్లలకి పెళ్లి చేసెయ్యాలనుకున్నాడు వాడు. ప్రపంచంలో ఎవరికీ అక్కర్లేని గొడవ వాడికి కావాలి. వాడిలో ఒక్క వీరేశలింగం పంతులు సంస్కరణే కాదు, వీరేశలింగం పంతులే వున్నాడు అందుకనే అంతసేపు ఆలోచించాడు. వాడి మనసుకు ఏమి తట్టిందో మనకు తెలీదు

చివరకు 'వెధవ ప్రపంచం' అనుకున్నాడు. శ్రీరంగ నీతులు చెప్పేవాళ్లే కాని, ఎవ్వరూ యిల్లాంటి పిల్లల్ని పెళ్లి చేసుకోరేమని చర్చించుకున్నాడు. ఒకవేళ వితంతువుల్ని పెళ్లి చేసు-

కుంటే సమాజనులే పిచ్చిగా అనుకుంటారేమో కాని, అధునాతనులు కావలసినంత గౌరవం చూపుతారు. మంచి పని చేసేవని పూలమాలలు కూడా వేస్తారు.

అయితే భవిష్యత్తులో వేసే పూలమాలల్ని గురించి రామకృష్ణ ఊహించలేదు. వితంతువులకి వివాహం చెయ్యాలనే సాంఘిక నీతి వాణ్ని కదిపింది. అది మంచి పనే కాని, సుతరామూ చెడ్డపని కాదని వాడికి తెలుసు.

ఇందులో ఒక్క సంగతి వుంది. ఎవ్వరిలోనూ వికసించని మానవత్వం, రామకృష్ణలో ముందుగా వికసించడం వాడి అదృష్టమనే చెప్పాలి. ఒక రోజున బడికి వెడదామని పుస్తకాలు తీసుకుని బడిలోకి వెళ్లవలసినవాడు వంటింట్లోకి అడుగు వేశాడు. కన్నవాళ్ళతో సంబంధం లేకుండా, వాళ్ళ పిన్ని ఒకామె పిల్లలు లేని కారణంగా వాణ్ణి పెంచుకుంది. ఆమెకూ భర్త పోయాడు. రామకృష్ణ లోపలికి వెళ్లేటప్పటికి ఆమె అన్నం దగ్గర కూర్చున్నది. ఏదో డబ్బుకోసం వచ్చాడని భావించింది.

'ఏమిరా రామం స్కూలుకు వెళ్ళలేదూ!' అన్నది ఆమె.

'లేదే' అన్నాడు వాడు.

'ఏదైనా రోకం కావాలా' అన్నదామె

'లేదులే నా కొక సందేహం కలిగింది, నువ్వు తీర్చాలి!' అన్నాడు రామకృష్ణ.

'అదేమిటో చెప్పరా' అన్నది కాంతమ్మ.

'బాల వితంతువులు పెళ్లి చేసుకోగూడదే' అన్నాడు వాడు.

'చేసుకోకూడదు' అన్నది కాంతమ్మ.

'ఏం?' అన్నాడు వాడు.

'ఏమో!' అన్నది కాంతమ్మ.

ఇలాగే కబుర్లు గడిచాయి. కొడుకు యిలాంటి ప్రశ్నలు వేస్తాడని కాంతమ్మ ఎప్పుడూ అనుకోలేదు. రామకృష్ణ కూడా జంకూ గొంకూ లేకుండా, యశోద పేరెత్తి అలాంటి పిల్లలికి పెళ్లి చేస్తే తప్పేముందని ప్రశ్నించాడు. పురుష స్పర్శ లేకుండా, అటువంటి అందమైన ఆడపిల్లలు యిళ్ళల్లో మగ్గడం జాతికి చాలా చెడ్డది అంటూ వాడు తల్లితో చెప్పాడు. అయితే కాంతమ్మకు యిల్లాంటి పనులు చెయ్య కూడదనే తెలుసుకాని, చేస్తే అందులో తప్పేమిటో తెలియదు. రామకృష్ణ చెప్పిన ప్రతీ విషయం ఆమె బుర్రకు పట్టించుకుని విచక్షణా జ్ఞానంతో తరిచి తరిచి చూసింది. ఆమెక్కు వాడి మాటల్లో పొరపాటు ఎక్కడా కనుపించలేదు.

'యశోదని నే నెరక్కపోవడ మేమిట్రా, అవకాలబిడ్డలో శ్రీహరి గారి పిల్ల!' అన్నది కాంతమ్మ.

'అదేృ, యీ విషయం చెపుదామనే వచ్చాను. ఇంక బడికి పోతా' అంటూ రామకృష్ణ బడికి వెళ్ళిపోయాడు. తెలివైనవాడు కనక తన విషయం ఏమీ బయట పెట్టలేదు. కాంతమ్మ కూడా వాడి మనస్సులో ఏమివుందో కనిపెట్టలేక పోయింది. కొన్ని రోజులు జరిగాయి. ఓనాడు సాయంకాలం స్కూలు వదిలిపెట్టిన తర్వాత తిన్నగా యింటికి వచ్చాడు. అప్పటికప్పుడే వాడి మనస్సులో భావాలు ఒక నిర్ణీత అంతస్థుకు చేరుకున్నాయి. నమ్మిన సత్యాన్ని ఆచరణలో పెట్టాలనే సంకల్పం వాడిది. సాయంత్రం వంట అయిన తర్వాత కాంతమ్మ అధ్యాత్మ రామాయణం పాడుకుంటోంది. పుస్తకాలు బల్లమీదపడేసి, చొక్కా విప్పి దండెంమీద ఆరేసి, రామకృష్ణ ఆమె దగ్గరగా వచ్చి నిలుచున్నాడు. కాంతమ్మ పాట ఆపుచేసి వాడికేసి చూసింది.

'ఏమే అమ్మా, యశోదని నాలాంటివాణ్ణి పెళ్ళి చేసుకో కూడదే' అన్నాడు వాడు.

'నీ అఘాయిత్యం యిదైపోనూ, ధోరణి కట్టిపెట్టు' అన్నది కాంతమ్మ.

'అంటే చెప్పేవరకే గాని, చెయ్యడం నీవల్ల కాదన్నమాట. అంతట్లోకే యశోద చెడ్డదై పోయిందేం' అన్నాడు రామకృష్ణ రోషంగా.

ఈ ప్రశ్న కాంతమ్మ హృదయానికి సూటిగా తగిలింది. ఆమె ఆలోచనలో పడ్డది. ఎంత ప్రయత్నించినా ఆమె స్థితి ఆమెకు అర్థం కాలేదు. తనలోవుండే ఏదో ఒక శక్తికి నిర్దుష్టమైన రూపం లేదనుకున్నది. సూత్రాలు అల్లడం కంటె వాటిని ఆచరణలో పెట్టాలనే ఉత్సాహం కూడా లోకానికుండడం అవసర మనుకున్నది.

'మనకి కావలసినంత డబ్బున్నది. లోకంలో మనం చెయ్యగలిగిన ఉపకారం ఎందుకు చెయ్య

కూడదు!' అన్నాడు రామకృష్ణ.

కాంతమ్మ వాడు చెప్పిన మాటల్ని తరచి తరచి చూసింది. ఇంతలోకీ ఆమె మనస్సు ఆమె మేనత్త కూతురుమీదకు దొర్లింది. ఆమె చాలా అందమైంది. కాని యశోదకమల్లేనే వైధవ్యం అనుభవిస్తోంది. కాంతమ్మ మనస్సులో విచిత్రమైన అనుభూతులు పరుగులు పెట్టాయి. ఆమె రామకృష్ణకి సన్నిహితంగా వచ్చేసింది. ఒక్క క్షణం యశోదలాంటి అందమైన కోడలు తన యింట్లో మసిలినట్టు గోచరించింది ఆమెకు.

'నువ్వు చెప్పింది నిజమే. కాని లోకం మాటో!' అన్నది కాంతమ్మ.

'లోకమంటే' అన్నాడు రామకృష్ణ. లోకమంటే ఏమిటో కాంతమ్మకూ బోధపడింది కాదు. తనూ లోకంలో ఒక మనిషేగా!

నీకిష్టమైతే యశోదని కట్టుకో' అన్నది కాంతమ్మ. ఒక్క క్షణంలో ఆమెలో యింత మార్పు రావడానికి కారణం లేకపోలేదు. వాడి మనస్తత్వమూ, మంచితనమూ కాంతమ్మకి తెలియనివి కావు. వాడు ఏవిషయాన్ని గురించైనా అన్యాయంగానూ, అక్రమంగానూ భావన చేస్తాడని, వక్రబుద్ధితో వూహిస్తాడని కాంతమ్మ ఎప్పుడూ అనుకోలేదు. కాంతమ్మ హృదయంలో వాడికి ప్రత్యేకమైన స్థానం ఒకటుంది. అందుకనే అనూటంది.

ఎప్పుడైతే వాళ్లమ్మ 'ఊఁ' అన్నదో, ఒక్క గెంతువేసి వెనక్కి తిరిగాడు రామకృష్ణ. తిన్నగా డాబాయెక్కి ప్రపంచంకేసి చూశాడు. వాడికి ప్రపంచాన్ని ఉద్ధరించాలనే ధర్మం ఎక్కువగా కనిపించింది. ఏంచెయ్యాలా అనుకున్నాడు. వాడి మనస్సుకు ఏదో తట్టింది. కిందకి దిగి ఆ సాయంత్రం ఎండలో, కాగితమూ కలమూ పుచ్చుకుని యశోద ఎడ్రసుకి ఓ ఉత్తరం రాశాడు.

ఉత్తరమే ఎందుకు రాశాడన్న అనుమానం ఎవరికీ కలగనక్కర లేదు. అంత ఆత్మ జౌన్నత్యం వున్నవాడు యశోద తండ్రిదగ్గరకే స్వయంగా వెళ్ళి తను అనుకున్నది ఎందుకు చెప్పెయ్యకూడదా అని ప్రశ్నించనూ అక్కర లేదు. కార్యరంగంలో అడుగు వెయ్యడానికి ముందు, ఆమె అభిప్రాయాన్ని కనుక్కోవాలి గదా! అందుకనే వాడు ఉత్తరం రాశాడు. అలాంటి సందర్భాల్లో ఉత్తరాలు రాస్తారనే వాడూ అనుకున్నాడు.

యశోదకి ఆ మరునాడే హైస్కూల్లోకి తెచ్చి పోస్టుబంట్రోతు ఆ ఉత్తరాన్ని యిచ్చాడు. యశోద ఆ ఉత్తరాన్ని పుచ్చుకుని, వణుకుతూన్న చేతులతో చింపి, ఆమూలాగ్రంగా చదివింది.

అయితే, యశోద మనస్సులో ఆ సమయంలో ఎన్నోరకాల భావాలు పుట్టినాయి. దావానలాలు ప్రజ్వరిల్లినాయి. అన్నీ దాటిన తర్వాత తుఫానురోజుల్లో ముంచడానికై వచ్చే సముద్రకెరటాలు ఉద్భవించినాయి. ఆమె అలాంటి వృత్తాన్ని ఎప్పుడూ ఎరక్క కలవర పడింది. మరుగుతూన్న నూనెలో ఒక్క నీటి బిందువు విదల్చినట్టయింది. ఆమెకు ఆ ఉత్తరాన్ని ఏమిచెయ్యాలో బోధపడిందికాదు, దాద్దామనుకున్నది. అదీ చాతనైందికాదు. ఆ ఉత్తరాన్ని తీసికెళ్ళి అమాంతం హెడ్మాష్టరు దగ్గర పెట్టింది. ఇంటికెళ్ళి తండ్రితో చెప్పి ఆయనన్నా స్కూలుకు తీసుకొచ్చింది. ఈలోగా హెడ్మాష్టరు ఉత్తరం చదివి నల్లపేకబెత్తం పైకితీసి డ్రాయరుమీద పెట్టుకున్నాడు. రామకృష్ణలాంటి గడుగ్గాయలు స్కూల్లో పుట్టకూడదని ఆయన అభిప్రాయం. బంట్రోతు వెళ్ళి రామకృష్ణని క్లాసులోంచి తీసుకొచ్చాడు హెడ్మాష్టరు వాడికళ్ళలోకి తీక్షణంగా చూశాడు. యశోద అక్కడనే వుంది. అప్పటికి కూడా రామకృష్ణ తనని రక్షించడానికి పుట్టాడని ఆమెకు అవగాహన కాలేదు.

హెడ్మాష్టరు పళ్ళు పటపట కొరికాడు.

'ఏమిరా, ఈ ఉత్తరం రాసింది నువ్వేనా' అన్నాడు హెడ్మాష్టరు.

'నేనేనండి' అన్నాడు రామకృష్ణ. రామకృష్ణ ఏమీ ఒణికిపోవడం లేదు. వాడిలో మానవత్వం ముందుగానే వికసించిందని చెప్పాను కదూ!

'అలా రాయవచ్చునా ఆడపిల్లలికి' అన్నాడు హెడ్మాష్టరు.

'అలా రాయడంలో తప్పు లేదనుకునే రాశాను' అన్నాడు రామకృష్ణ.

హెడ్మాష్టరు చేతి బెత్తం ఝల్లుమన్నది. రామకృష్ణ ఏమీ కదలలేదు. యశోద నవ్వుతుంది. శ్రీహరి నవ్వుతున్నాడు.

ఈలోగా యశోదకు అందిన ఉత్తరాన్ని గురించి చర్చించుకునే కుర్రాళ్ళు యిదేమిటి చెప్మా అనుకుంటూ హెడ్మాష్టరు గదిదగ్గరకి చేరుకున్నారు. ప్రేమ కథలు చదువుకునే నలుగు రైదుగురు మాష్టర్లు కూడా అక్కడికి చేరుకున్నారు.

'అయితే అలాంటి ఉత్తరం రాయడం తప్పు కాదని నీ అభిప్రాయం' అన్నాడు హెడ్మాష్టరు.

'అందులో ఏం రాశానని?' అన్నాడు రామకృష్ణ.

'ఏం రాశావో నీకు తెలీదా' అన్నాడు హెడ్మాష్టరు.

'అందులో ఏం రాసినా అన్నింటికీ బాధ్యత వహించి రాశాను. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనే రాశాను' అన్నాడు రామకృష్ణ.

వాడి గాత్రమూ, వ్యవహారమూ అన్నీకూడా ముదురుతున్నట్టే హెడ్మాష్టరు భావించాడు. ఇల్లాంటి నెధవలకి తప్పుడు అభిప్రాయాలు కాకపోతే మంచి అభిప్రాయాలు కూడాను! తగిన శిక్షకోసం వెదికాడు. ఏమీ తట్టలేదు.

'పో క్లాసుకు పో' అన్నాడు హెడ్మాష్టరు.

రామకృష్ణ క్లాసుకు వెళ్ళిపోయాడు. వాడు భయంతో వెళ్ళలేదు. మామూలుగా వెళ్ళిపోయాడు. ఎందరో ఎన్నో ప్రశ్నలు వేశారు. అవన్నీ మీ కనవసరం అన్నాడు వాడు. అంతే. యశోదకూడా క్లాసుకు వెళ్ళలేదు. ఇంటికి వెళ్ళిపోయింది. గర్వంతో వెళ్ళిపోయింది. తను కాబట్టి అలాంటి రాతలని సహించలేక, వాడి పైత్యం వదిలించింది, పూర్వకాలంలో తనలాంటి వాళ్ళనే పతివ్రతలన్నారని అహంభావంతో చరచరా యింట్లోకి వెళ్ళిపోయింది.

ఆ మరునాడు హెడ్మాష్టరు నలుగురు ఎసిస్టెంట్లనీ పిలిచి సభ పెట్టాడు. సభలో యశోద కథ చర్చించబడింది. తనకూ ఓ చదువుకునే కూతురున్న ఆసామీ రామకృష్ణగాడ్ని స్కూల్లో చదవనిస్తే వాడందర్నీ పాడు చేస్తాడన్నాడు.

'అవునండోయ్' అన్నాడు మరొక ఇద్దరు కోలువా.

ఏకగ్రీవంగా, రామకృష్ణగాణ్ణి స్కూలులోంచి బయటకు పంపించెయ్యాలనే తీర్మానం ఆమోదించారు. వాడు ఆ రోజునే బయటకు నడిచాడు.

అయితే నేం, వాడిలో ఏ మార్పూ లేదు. ఒక్కసారి మాత్రం అనుకున్నాడు: ఉపకారానికి వెడితే, అపకారం ఎదురొచ్చిందని. వాడు బయటకు వచ్చేరాడు విచారించేవాళ్ళూ, సంతోషించేవాళ్ళూ కూడా వున్నారు. విచారించినవాళ్ళు అనుకున్న దేమిటంటే, బాగా చదివే కుర్రాడూ హైస్కూలుకి అన్ని విధాలా పేరు తెచ్చే కుర్రాడూ, ఒకడు అనవసరంగా బయటకు పంపబడ్డాడూ అని

రామకృష్ణ స్కూల్లోంచి వెళ్ళిపోయిననాడు యశోద గర్వంగా ముందుకు నడిచింది. ఆమె పేరు యీ కథలో నలుమూలలా వ్యాపించడం వల్ల అయ్యబాబోయ్, నిప్పులాంటిపిల్లోయ్ అనుకున్నారు నలుగురూ. తత్ఫలితంగా ఎవడూ కూడా దాని వెనక్కాలే నడవడమే మానుకున్నాడు. ఆ గర్వమే దానిలో యిప్పటివరకూ నిలిచిపోయింది.

రామకృష్ణలో ఏ మార్పూ రాకపోయినా కాంతమ్మలో కావలసినంత వచ్చింది. కుర్రాడు స్కూల్లోంచి బయటకు తరమబడడమూ, అన్నీ చూసి బెంగపెట్టుకుంది. కన్నతండ్రిగారి గ్రామం వెళ్ళి ఆయన్ని తీసుకువచ్చింది. అతనూ ఆమె కలిసి, శ్రీహరిగారింటికి వెళ్ళి క్షమార్పణ చెప్పుకున్నారు. అంతా వెళ్ళారన్న మాటేగాని, హెడ్మాష్టరు వాణ్ణి తిరిగి జాయిన్ చేసుకోనన్నాడు. అంతా తిరిగివచ్చి రామకృష్ణగాణ్ణి ముందుకు తోశారు.

ఎందుకూ' అన్నాడు వాడు.

'కాళ్ళమీద పడరా బాబూ' అన్నారు.

'నా జీవితంలో ఆ స్కూల్లో అడుగుపెట్టను' అన్నాడు వాడు.

కన్నతండ్రి అగ్గిబుగ్గి అయిపోయాడు. వాడికేసి గుర్రుగా చూస్తూ-

'ఏమిరా గాడిద కొడకా, ఇలాంటి పొయ్యేకాలం బుద్ధులు పుట్టేయేం' అన్నాడు.

రామకృష్ణ మాట్లాడలేదు. కాంతమ్మ అడ్డుకుని, వాణ్ణి తిట్టకద్దంది.

'నీ కిచ్చాక నీ కొడికే. నీ గారామే యింత వరకూ తెచ్చింది' అంటూ కన్నతండ్రి వెళ్ళిపోయాడు.

మొత్తంమీద రామకృష్ణలో వికసించిన విజ్ఞానాన్ని ఎవరూ ఆఘ్రాణించ లేకపోయారు. వాణ్ణి మామూలు కుర్రాడిగానే ఎంచి విచారించారు. ఎంత ఎంచినా వాడు మామూలు కుర్రాడుకాదు. వాడిలో అత్యద్భుతమైన సంస్కారం వుంది.

ఈ విషయాలన్నీ యిప్పుడు జరిగినవి కావు. అయిదు సంవత్సరాలక్రితం జరిగిన విషయాలు. ఇవన్నీ ఒకదాని వెంబడి ఒకటి, కాలేజీలో ఇంగ్లీషు క్లాసులో కూచున్న యశోద మనసులో గిరగిరా తిరిగాయి. ఇప్పుడు ఆమె అలాంటి మహూర్తం కోసం ఎదురుచూస్తోంది. ఆమె ఎదురు చూడకుండా వున్నప్పుడు, అయిదు సంవత్సరాల క్రితం ఆ మహూర్తం వచ్చింది. దానంతట అది వచ్చింది. రామకృష్ణ రూపంలో వచ్చింది. దాన్ని ఆమె కానుకోలేకపోయింది. కాని యిప్పుడు విచక్షణాజ్ఞానం అభివృద్ధిచెంది, ఆమె ఎదురు చూస్తూవుంటే అల్లాంటి సంఘటన రావడంలేదు. యశోదకు ప్రపంచం కల కిందులుగా అయిపోయినట్టు తోచింది.

పీరియడు ఆఖరుని గంట కొట్టారు. బుర్ర వేడెక్కిపోయి వెయిటింగు రూంలోకి వచ్చేసింది. కాని ఎక్కడికి వస్తేయేం. మనస్సంతా గందరగోళంగావుంది. కొంచెం సేపటికి అంత అలజడీ సర్దుకుంది. అప్రయత్నంగా 'రామకృష్ణ యింత గొప్పవాడా' అనుకుంది. రామకృష్ణ అంత గొప్ప వాడైతే, రాధ అంత తెలివైనదన్న మాట! ఏమిటోకాని, యీ కథంతా జ్ఞాపకం చేసుకున్నాక, భావనాశక్తి అభివృద్ధి అయిన యశోద హృదయంలో రామకృష్ణమీద ప్రేమా రాధమీద అసూయా కలిగాయి. దీనికి కారణం లేకపోలేదు. అదికూడా అయిదు సంవత్సరాల క్రిందటే జరిగింది

రాధ అనే అమ్మాయి యశోదతోటే హైస్కూల్లో చదువుకుంది. ఇద్దరిదీ ఒకటే క్లాసు. మార్కుల్నిబట్టి తెలివితేటల్ని నిర్ణయించడానికి పూనుకుంటే వ్యర్థమే అవుతుంది. ఒకటి రెండింటిల్లో యిద్దరూ సమానస్థాయీ మనుష్యులే. కాని ఆర్థిక పరిస్థితిలో మాత్రం తేడావుంది. అంతకంటే ముఖ్యమైన దేమిటంటే యశోదకు ఒకసారైనా పెళ్ళయింది. కాని రాధకుమాత్రం పెళ్ళి కాలేదు.

రామకృష్ణ స్కూల్లోంచి వెళ్ళిపోయినాడు. రాధ వాడి కళ్ళల్లోకి చూసింది. ఆమెకు వాడి కళ్ళల్లో విజ్ఞాన సంస్కారాలు కనిపించాయి. యశోదను గురించి ఆలోచించి 'అది కష్టం తెలుసుకోలేదుకాని, వాణ్ణి తప్పకుండా పెళ్ళి చేసుకోవలసింది' అనుకుంది కాంతమ్మ కొడుకువలపే వున్నదని ఊళ్లో ఏర్పడిన సంచలనం వల్ల రాధలో ఆ అభిప్రాయం మరీ బలపడింది. దాంతోపాటు ఆమెకు రామకృష్ణ యశోదకు రాసిన ఉత్తరంలో ఏం రాశాడో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. అంతేకాదు, ఎట్లాగైనా ఆ ఉత్తరాన్ని సంపాదించాలనుకున్నది. కాని ఉత్తరం ఏదీ? హెడ్మాష్టరు ఆనాడే చింపేశాడు.


ప్రఖ్యాతిగాంచిన ప్రశస్తమైన

**మెహతావారి**
**విశేష ఔషధములు**

1 సుందరి ఎలిక్జిర్ :—సమస్త ఋతు దోషములను పోగొట్టును, గర్భాశయరోగ ములను నివారిణి.

2 ఫాస్ఫరస్ ఆయిల్ :—బాధ నివారణకు సాటిలేని తైలము.

3 మస్తానాపిల్సు :—సాధారణబలహీనత, కీళ్లనొప్పులు, జ్వరము వన్నిటికీ అమోఘముగా పని చేయును.

4 ద్రాక్షాసవము :—(బంగారము, మకరధ్వజము కలిసినది) రక్తమును శుద్ధి పరచునటువంటి, అజీర్ణము రూపుమాపునటువంటి బలవర్ధకౌషధము.

కెమిస్టు లందరివద్ద దొరకును.

తయారు చేయువారు:

**K. S. MEHTA & CO.,**
**250, China Bazar, Madras.**

'ఏమే, రామకృష్ణ ఏంరాశాడే!'

'ఏంరాస్తాడు. ఏదో సంస్కారి ననుకున్నాడు, కవిత్వం ఒలికించాడు. అందుకనే తన్నులు తిన్నాడు' అన్నది యశోద.

ఈ మాటలంటూ యశోద నవ్వుతుంది. రాధ మాత్రం నవ్వలేదు. కారణం ఆమెకు యథార్థం తెలుసు. రామకృష్ణ కార్యవాదని ఆమె మనస్సులో దృఢమైన అభిప్రాయం ఏనాడో ఏర్పడింది.

రాధకు రామకృష్ణమీద ఆలోచనలు ఎక్కువైపోయాయి. ఆ సంస్కర్తకు మనసులోనే నమస్కారం పెట్టుకున్నది.

స్కూలు ఫైనలు పరీక్షలయిపోయాయి. రామకృష్ణ వూళ్లోనే వున్నాడు. రాధ, రామకృష్ణుని గురించి పూజ్యభావంతో ఉన్నది. ఆమె మనస్సు అతని మీదకు ప్రవహించింది. బుద్ధిపూర్వకంగా అతన్ని వివాహం చేసుకోవాలని రాధ అనుకున్నది.

ఇలా భావించడానికి రాధకు కారణాలు లేకపోలేదు. సంస్కర్త ఒకే వ్యూహంలో మడికట్టుకు కూచోడని రాధకు తెలుసు. బాల వితంతువు ఏ విధంగా అతని మనస్సు ఆకర్షిస్తుందో, నిస్సహాయ స్థితిలో వుండే మరొక బీదవాడూ అలాగే ఆకర్షిస్తాడు. అందుకనే రాధ, రామకృష్ణ వైపు ఆశగా ఎదురు చూడ్డానికి కారణమైంది.

వాస్తవికంగా, రాధకు ఒక్క తల్లి తప్ప దిక్కెవరూ లేరు. తండ్రి తనకున్న యకరం పొలం భార్యా బిడ్డలకు వదలి ఏడు సంవత్సరాల కిందట మసూచికంతో చచ్చిపోయాడు. రాధ తల్లి ఆ ఒక్క కూతుర్నీ అతి గారాబంగా చూసుకుంటూ తనకున్న దానిలోనే తింటూ పెంచుకొచ్చింది. తెలివైంది కనక చిన్న బడిలోంచి పెద్ద బడిలోకి రాధ చక్రున వచ్చేసింది. హెడ్మాస్టరు స్కాలర్‌షిప్పు యిచ్చి, జీతం లేకుండా చదువుకునేందుకు రాధకు అనుమతిచ్చిన కారణంచేత, ఆమె చదువు బాధ ఆమె తల్లికేమీ లేకపోయింది.

అమాంతం వయస్సువచ్చి రాధ శరీరంమీద వాలడంతో ఆమె సమస్త అంగాలూ వికసించాయి. కండలు పట్టవలసిన చోట పట్టాయి. అందం వుండవలసిన చోట అందం వచ్చింది. ఈడొచ్చిన పిల్లకి పెళ్లికోసం కామాక్షమ్మ తహతహ పడుతూనే వుంది. కాని కట్నం లేకుండా పిల్లనెవరు చేసుకుంటారు! ఆ కట్నాలకేనా చిన్న పడిగారా? పెద్ద పెద్దవి అడిగారు. ఉన్న యకరం పొలం తదనంతరపు హక్కు రాసిస్తామంటే, కామాక్షమ్మని తక్షణం చచ్చిపొమ్మన్నారు. అందువల్లనే రాధకు పెళ్లికాలేదు.

ఈ సందర్భంలోనే రాధ మనస్సు రామకృష్ణ మీద వాలింది. వాడిలా వున్న నైతిక శక్తి ఆమెను ఆకర్షించింది. అందుకనే అతను తప్పక పెళ్లిచేసుకుంటాడనే విశ్వాసం కలిగింది. ఈ విశ్వాసం కలిగిన తర్వాత రాధ వాడి పేర ఒక ఉత్తరం రాసింది. అప్పటికి వేసంగి ప్రారంభం అయింది. రాధ ఆ ఉత్తరంలో ఎక్కువ మాటలు గాని, ఎక్కువ కాగితాలు కాని ఉపయోగించలేదు. క్లుప్తంగా తన జీవితాన్ని గురించి రాస్తూ తన అభ్యర్థనకి ప్రేమ అనే నామకరణం చెయ్యకుండా, యిలాంటి పెళ్ళికి ఒప్పుకుని, తనని గౌరవించినా, అదికూడా సంస్కరణలోని భాగమే అవుతుందని హెచ్చరించింది. ఆ మరునాడే రాధ కామాక్షమ్మని, కాంతమ్మగారింటికి పంపింది.

ఆ ఉత్తరం రామకృష్ణని ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. ఆడది మగవాడికంటె ముందు అడుగేస్తుందని నమ్మని ప్రపంచంలోని మనుష్యుల్లో వాడూ ఒకడు కనక యిది యథార్థమా అనుకున్నాడు. వాడి మనస్సు వూహాకందని స్వప్న శిఖరాన్ని అందుకుంది. వాడు ఏ సమాధానాన్ని యశోదనించి ఆశించాడో, ఆ సమాధానం రాధ దగ్గరనించి వచ్చింది. పిలిచిన పిలుపును అందుకున్న వాళ్ళు మరొకరయ్యారు. ఏ ధ్వనికి ఆ ప్రతిధ్వని వస్తేనే లోకం సంతోష పులకాంకితమవుతుంది.

రామకృష్ణ ఒక్క గెంతుగెంతి వంటింట్లో పడ్డాడు. అక్కడ వియ్యపురాళ్లిద్దరూ చెవులు కొరుక్కుంటున్నారు.

'ఏమిరా అబ్బాయి, కామాక్షమ్మగారు ఏదో అంటున్నారు, విన్నావా' అన్నది కాంతమ్మ.

'ఏమిటది' అన్నాడు ఏమీ ఎరగనట్టు.

'మా రాధమ్మని నువ్వు చేసుకోవాలి' అన్నది కామాక్షమ్మ.

'మరి పదివేలు కట్నం కావాలి' అన్నాడు రామకృష్ణ.

'నువ్వే సంపాదించుకుందువు గాని,' అన్నది కామాక్షమ్మ.

ఇలా మాటలు జరిగాయి. ముందుకు అడుగు వేసినట్టేవేసి, గిరుక్కున తిరిగి రాధను చేసుకుంటా నన్నాడు రామకృష్ణ. కామాక్షమ్మ సంతోషంతో యింటికి వెళ్ళిపోయింది.

తర్వాత కొద్ది రోజుల్లో ముహూర్తం నిశ్చయం చెయ్యడం, ఆ పెళ్ళి చాలా అందంగా జరగడం, దానికి యశోదా, హెడ్మాష్టరూ, హాజరు కావడం మొదలైన విషయాలు జరిగిపోయాయి. నాగపురంలో పనిచేస్తూన్న రామకృష్ణ పినతండ్రి వాడికి చక్కటి ఉద్యోగం యిప్పించాడు. వెంటనే తల్లినీ, భార్యనీ, అత్తగారినీ తీసుకెళ్ళి నాగపురంలో నాలుగేళ్ళనించి కాపురం చేసుకుంటున్నాడు.

ఇటువంటి రామకృష్ణ కాలేజీలో వెయిటింగు రూంలో వున్న యశోద మనస్సులో మెరిశాడు. ఆమెకు అతనిమీద గల కోపమూ, ఆగ్రహమూ అన్నీపోయి, భక్తితాత్పర్యాలు కలిగినాయి. ఈనాడు రామకృష్ణ తనని గురించి ఏమనుకుంటున్నాడో! ఆనాడు తనకి వచ్చిన పిలుపును స్వీకరించి, అతనితో జీవించడానికి ఒప్పుకుంటే, రాధ స్థానం తనకు రావలసింది. కాని ఆమెకు ఆప్పట్లో మానసిక వికాసంలేక అంతటి తేజస్సును చూడలేక పోయింది. అసలు లోకంలో వుంది ఆవ్యాధి-కంటికెదురుగా అనేక రకాలైన ఉజ్వలశక్తులు ఉప్పతిల్లుతూ వుంటాయి. ఏరాయివాడెవడో వాటికి నామకరణం చేసే వఱకూ లోకం వాటిని చూడనే చూడదు.

యశోద మనస్సు ఒక్కసారిగా విజృంభించింది. కాలేజీ రెండవగంట కొట్టారు. తెలుగు పీరియడు. అయినాసరే రామకృష్ణ యిప్పుడెల్లా వున్నాడో! తనని గురించి ఏమనుకుంటూ వున్నాడో! అమాంతం యశోదకి రాధమీద అసూయతో కూడుకున్న సంతోషం కలిగింది. క్లాసులోకి వెళ్ళవలసిన మనిషి యింటికి బయలుదేరింది. అరుగుమీద శ్రీహరి కూచున్నాడు.

'ఏమే అమ్మాయ్, అప్పుడే వచ్చేసేవేం' అన్నాడు.

'తెలుగు లెక్చరర్ రాలేదు నాన్నా' అంటూ లోపలికి గంతేసింది. వంటింటికి యివతల వరండాలో రాధ కూచున్నది. పక్కని రామకృష్ణ గ్లాసుకో బిస్కటు కొరుకుతున్నాడు. యశోద కంటికి అలా కనిపించాడు గాని వాడు రామకృష్ణ కాదు. రామకృష్ణ కొడుకు. ఏమో ఏమనుకుందో, వాణ్ణి తీసుకుని అమాంతం ఒళ్ళంతా ముద్దులు కురిపించింది. ఆమెలో అఖాతాల అడుగున ఏ కోర్కెలు ప్రవహిస్తున్నాయో తెలీదు. ఆ అలజడికి ఆగలేక బావురుమని ఏడ్చాడు కుర్రాడు

'అచ్చు రామకృష్ణలాగే వుంటాడే' అన్నది యశోద.

'మరి ఎవరిలా వుండమన్నావు' అన్నది రాధ.

పుస్తకాలు బీరువాలో సర్ది, నీళ్ళగదిలో ముఖం కడుక్కుని వచ్చి రాధపక్కనే కూచుంది. ఆమెమనస్సులో ఏదో ప్రశ్నించాలనే కోరిక పుట్టింది. ఏమిటి ప్రశ్నించడం? ఆగలేక ఆగలేక చివరకు అడిగింది:

'రాధా,నన్ను గురించి ఎప్పుడైనా స్మరిస్తాడేమో ఆయన?'

'నిన్ను గురించా! ఎప్పుడూ వ్యక్తిగతంగా నీ పేరెత్తి ఏమీ అనలేదు గాని, నీలాంటివాళ్ళకి సమాజం పెళ్ళిళ్ళు చెయ్యాలనే ఆయన నేటికీ వాదిస్తారు' అన్నది రాధ.

ఆలాంటి వీరులెప్పుడో గాని ముందుకు రారని యశోదకు యిప్పటికి తెలిసింది. రామకృష్ణలోని మానవత్వపు ఔన్నత్యాన్ని స్మరించడం వల్ల ఆమెకళ్ళు చెమ్మగిల్లాయి.

